## కథ

-వి.బి. రాజ్‌కమల్

# అంతర్మథనం

**ఇవాళ చాలా హడావిడిగా వుంది. మా పనిమనిషి యాదమ్మ ఇవాళ రానని కబురు పంపింది. నిన్ననే చెప్పుంటే ముందుగా లేచి అన్ని పనులు చేసుకొనేదాన్ని కదా! ఇదెప్పుడూ ఇంతే..చెప్పాపెట్టకుండా మానేస్తుంది. నా పెద్దకూతురు లక్ష్మీప్రసన్నని నిద్రలేపి, స్నానానికి పంపించి ఇప్పుడే వంటగదిలోకి వచ్చి మిక్సీ పెట్టాను.**

''లేచి పావుగంటైంది, కాస్త కాఫీ నా మొహాన కొట్టొచ్చుకదా!'' అన్న సునీల్ కేక వినబడింది.

''ఆ! తెస్తున్నానండీ..'' నా హడావిడిలో నేనుంటే ఈయనకి నా రాచమర్యాదలొకటి. నిజంగానే కాఫీ మొహాన కొట్టాలనిపించింది. లేకపోతే హాల్‌లో కూర్చుని న్యూస్‌పేపర్ చదివే బదులు వంటగది వరకూ రాలేడా?

కాఫీని టేబుల్ మీద పెట్టాలో చేతికి అందివ్వాలో అర్థం కాలేదు.

ఏం చేసినా ఏదో ఒకటి అంటాడు. నన్ను గమనించనట్టే సీరియస్‌గా పేపర్ చదువుతున్నాడు.

''తెస్తాను కదా..ఎందుకా కేకలు?'' అన్నాను నా రాక తెలిసేటట్టుగా.

''ఏమిటో మేడమ్‌గారు ఇవాళ తెల్లవారుఝామునే చిర్రుబుర్రులాడుతున్నారు. పాపం యాదమ్మ హాండిచ్చిందా? ఏమీ లేదురా, నాకు ఆఫీస్‌కి టైమ్ అవుతుంది కదా, అందుకే పిలిచాను'' ఆయన చెప్తూనే వున్నారు, నేను నా పనిలో మునిగిపోయాను. ఈ వెటకారాలకేమీ తక్కువ లేదు, ఆయనొక్కడికేనా ఆఫీసు, మాకు లేదా? పైగా ఆ సానుభూతి ఒకటి..చేతనైతే సాయం చెయ్యాలిగానీ ఇలా కూర్చుని సానుభూతి చూపించేవాళ్ళంటే నాకు అసహ్యం.. అసహ్యం.. అసహ్యం...

ఇప్పుడు అసహ్యం అంటున్న నేనేనా ఇతన్ని కాలేజ్‌లో ప్రేమించింది?

అసలు నేను ప్రేమించింది ఇతన్నేనా? కాదు.. కాదు.. నేను ప్రేమించిన సునీల్ వేరు. అతను మారాడా? లేక నేను మారానా? మేము ఇంజనీరింగ్ చదివేటప్పుడు ఒకరికొకరు పరిచయమై, అది ప్రేమగా మారి (ప్రేమ అనుకొని) ఉద్యోగాలు రాగానే పెళ్ళి చేసుకున్నాం. పెళ్ళి జరిగిన మరుసటి రోజే నాకు తనలో తేడా కనిపించింది. అంతకు ముందు వరకూ ''నువ్వు సునీల్ అని పిలుస్తుంటే ఎంతో బాగుంది, ఇప్పటివరకూ ఎవరు నన్ను పిలిచినా నేను ఇటువంటి అనుభూతికి లోనుకాలేదు'' అనేవాడు. కానీ పెళ్ళి జరిగిన తరువాత, ''భర్తని పేరుపెట్టి పిలిస్తే బాగుండదు అందుకని ఏవండీ అని పిలువు'' అన్నాడు, నా నోట్లో హల్వా పెడుతూ. దానిలోని తియ్యదనాన్నంతా ఎవరో లాగేసినట్టుగా అనిపించింది నాకు.

''అయినా, ఈ పవిత్ర భారతదేశంలో భార్య భర్తకి మర్యాద ఇవ్వడం అనాదిగా వస్తున్న ఆచారమోయ్, దాన్ని కాదనకూడదు'' అన్నాడు.

భార్యాభర్తల మధ్య వుండవలసినది మర్యాదా? చనువా?

సరేలే అందరిముందు అలా పేరుపెట్టి పిలిస్తే ఇబ్బంది పడుతున్నాడేమోనని సరిపెట్టుకున్నాను. అప్పట్లో సునీల్ సారీ..సారీ మా ఆయన బెంగుళూరులో ఉద్యోగం చేసేవారు, నేనేమో హైదరాబాద్. కొంతకాలానికి ఆయన కూడా హైదరాబాద్‌కే మార్పించుకున్నారు. అప్పటివరకూ అమ్మ, నాన్న నాతోనే వుండేవారు. ఆయన వచ్చాక మా వాళ్ళని మా సొంత ఊరికి వెళ్ళిపొమ్మని చెప్పమన్నారు. అది కూడా నేనే చెప్పాలంట. ఆయన ఇమేజ్ డామేజ్ కాకూడదు కదా! మీ వాళ్ళను కూడా పిలవండి, అందరం కలిసి ఒకే దగ్గర వుందాం అంటే ససేమిరా కాదన్నాడు.

''మా వాళ్ళకి పెన్షను వస్తుంది, మీ వాళ్ళకి ఊరిలో పొలాలు వున్నాయి. వాళ్ళ బ్రతుకు వాళ్ళు బ్రతకగలరు. నువ్వు ఎవ్వరినీ ఉద్ధరించనక్కర్లేదు. అయినా ఉమ్మడి కుటుంబాలు వుండే రోజులు కావివి'' అన్నాడు.

మార్పు రోజుల్లో వుండదు, మనుషుల్లో వుంటుందని ఎంత చెప్పినా వినిపించుకోడు. ఇలా ప్రతీదానికీ వాదన వున్నా..చివరికి ఆయన మాటే నెగ్గాలి!

''అమ్మా! స్కూల్ బస్ వచ్చే టైం అయ్యింది, బాక్స్ రెడీయా?'' లక్ష్మీప్రసన్న మాటలతో ఈ లోకానికి వచ్చాను.

దాన్ని బస్ ఎక్కించడానికి వెళ్ళేటప్పుడు గుర్తుచేసింది ఇవాళ సాయంత్రం వాళ్ళ స్కూల్‌లో పేరెంట్స్ మీటింగ్ వుందని.

''ఇవాళ ప్రసన్న స్కూల్‌లో పేరెంట్స్ మీటింగ్ వుందట, సాయంత్రం మీరు దాని స్కూల్‌కి వెళ్ళండి'' స్నానానికి బయలుదేరుతూ సునీల్‌తో అన్నాను.

''నాకు కుదరదు ఇందు, ఇవాళ నా ఫ్రెండ్ పుట్టినరోజు. సాయంత్రం పార్టీ వుంది. బహుశా రాత్రి నేను వచ్చేసరికి బాగా ఆలస్యం అవ్వొచ్చు''

నాకు మాత్రం ఎలా కుదురుతుంది? ఇవాళే ప్రోజెక్ట్ పూర్తి చెయ్యమన్నాడు మా బాస్. కానీ తప్పదు. నేనే వీలు చేసుకోవాలి.

''సరేలెండి, నేనే ఎలాగో ఒకలాగ వెళ్తాను'' బాత్రూమ్‌లోంచే అరిచాను.

కాలేజ్‌లో చదివేటప్పుడు, నేను చెప్పానని మందు మానేసిన సునీల్, పెళ్ళి జరిగాక మళ్ళీ మామూలే. అప్పుడు మాత్రం మానేసాడని గ్యారంటీ ఏమిటి? నన్ను అలా నమ్మించాడంతే!

ఆ నమ్మకమే పోయినప్పుడు ఇక ప్రేమాభిమానాలు ఎక్కడుంటాయి?

ఛీ, ఇలా ఆలోచించేకొద్దీ మనస్సు పాడవడం తప్ప ఈ సమస్యకు పరిష్కారం లేదు. అందుకే నా ఆలోచనలని నాకు ఇష్టమైన వాటి

**ఆంధ్రభూమి దినపత్రిక ఉగాది కథల పోటీలో ఎంపికైన కథ**

పైకి మరల్చాను. కాలేజ్‌లో కష్టపడి చదివాను. మంచి ఉద్యోగం..ఐదు అంకెల జీతం..ఇంతకంటే ఏం కావాలి జీవితానికి? పెద్దకూతురు ఇంట్లోనే వుండి ఏడవ క్లాసు చదువుతుంది. చిన్నది లక్ష్మి పల్లవి కొంచెం డల్ అని హాస్టల్‌లో చేర్పించాం. అన్నట్టు పల్లవిని చూసి వారం దాటింది, మొన్న ఆదివారం ప్రోజెక్ట్‌లో బిజీగా వుండి వెళ్ళడం కుదరలేదు. పాపం అది ఫోన్‌లో చాలా నీరసంగా మాట్లాడింది. ఈ ఆదివారం తప్పకుండా వెళ్ళాలి. ఈ ఆలోచనలతో స్నానం ముగించుకొని, ఆఫీస్‌కు బయల్దేరాను.



''ఏవండీ! నేను ఆఫీస్‌కు వెళ్తున్నా, మీ లంచ్ బాక్సు వంట గదిలో వుంది''

''ఇవాళ పార్టీ వుందిగా, నేను మధ్యాహ్నం భోజనం చెయ్యను. నువ్వు వెళ్ళులే''

పార్టీ వుంటే ఖాళీ కడుపుతో వెళ్ళి పూర్తి న్యాయం చెయ్యాలన్నది ఆయన పాలసీ. కాలేజ్‌లో చెప్తూవుంటే ఏదో జోక్‌గా తీసుకున్నాను గానీ, ఎప్పటికీ ఇలాంటి చెత్త అలవాట్లని మానుకోలేడనుకోలేదు.

ఆఫీస్‌కి వెళ్ళగానే ఈ ఆలోచనలని ప్రక్కన పెట్టి పనిలో పడ్డాను. ఈ ప్రోజెక్ట్ ఎంత త్వరగా పూర్తిచేస్తే అంత త్వరగా ప్రసన్న స్కూల్‌కి వెళ్ళొచ్చు. ఇంతలో సెల్ రింగ్ అయ్యింది. ఫోన్ మా బాస్ దగ్గర నుంచి.

''గుడ్ మార్నింగ్ సర్, చెప్పండి''

''హల్లో ఇందిరా! ఎంతవరకూ వచ్చింది పని?''

''అయిపోవచ్చింది సర్''


''త్వరగా ఫినిష్ చేసిరా, నీతో చాలా విషయాలు మాట్లాడాలి. నీకోసం వెయిట్ చేస్తూ వుంటాను''

''సరే సర్''

''నన్ను ఎక్కువసేపు వెయిట్ చెయ్యించకు, వెయిట్ పెరిగిపోతాను'' అని ఒక వెకిలినవ్వు నవ్వి ఫోన్ పెట్టాడు.

'ఈ వేషాలు చూసే ఎవరూ నీకు వెయిట్ ఇవ్వరు' అని మనసులో అనుకుని, ఏదో ఒక ఫోన్ వస్తుంటే లేట్ అవుతుందని సెల్ స్విచ్ ఆఫ్ చేసి పనిలో పడ్డాను.

సాయంత్రానికి ప్రోజెక్ట్ పూర్తయ్యింది. ఎంత త్వరగా వదిలించుకుందామన్నా పావుగంట,నా బుర్రతిని, పిల్చి పిప్పి చేసి వదిలాడు.



ప్రసన్న స్కూల్‌కి వెళ్ళేసరికి మీటింగ్ అయిపోయింది. కానీ అదృష్టవశాత్తూ దాని క్లాస్ టీచర్ ఇంకా వున్నారు.

''ప్రసన్నకి ఈమధ్య చదువు మీద శ్రద్ధ తగ్గిందండి, మేము ఏమన్నా అంటే అన్నామంటారు. మీరే చెప్పండి మీ అమ్మాయికి, అసలే పబ్లిక్ ఎగ్జామ్స్ కదా'' నడుస్తూనే చెప్పేసి వెళ్ళిపోయారు ఆవిడ. ప్రసన్నని తీసుకుని ఇంటికి వచ్చేసరికి బాగా చీకటి పడింది, ఈ భాగ్యనగర ట్రాఫిక్ దయవలన.

నేను కాళ్ళు కడుక్కుని వచ్చేసరికి ప్రసన్న టి.వి. చూస్తోంది. ఏదో పాత క్రికెట్ మ్యాచ్ హైలైట్స్! వీళ్ళ నాన్నే దీనికి క్రికెట్ చూడడం బాగా అలవాటు చేసాడు. పిల్లల్ని టి.వి.కి దూరంగా వుంచాలని నేను చెప్పిన మాటల్ని ఖాతరు చేయడు. దీనికి ఈ అలవాటు ఎలా మాన్పించాలో నాకు అర్థం కావడం లేదు. దీని గురించి ఆలోచిస్తుంటే పల్లవి గుర్తుకొచ్చింది. ఒక్కసారి దానితో మాట్లాడదామని ఫోన్ చేసాను.

''సారీ మేడమ్, స్టూడెంట్స్ అంతా స్టడీ అవర్‌లో వున్నారు. ఇప్పుడు డిస్టర్బ్ చేస్తే ఇక చదవరు. సాయంత్రం నాలుగు, ఐదు గంటల మధ్యలో వాళ్ళు ఫ్రీగా వుంటారు, ఆ టైమ్‌లో ఫోన్ చెయ్యండి మేడమ్'' ఖరాఖండిగా చెప్పినా మాటల్లో వినయం వుండేలా జాగ్రత్తపడింది ఆ రిసెప్షనిస్టు. ఐదో క్లాస్‌కి గంటల తరబడి స్టడీ అవర్స్‌లో ఏమి చదవాలో? కొంపదీసి ఇప్పటి నుంచే ఐ.ఐ.టికి కోచింగ్ ఇచ్చెయ్యడం లేదు కదా! ఎలాగూ ఈ ఆదివారం వెళ్ళి చూస్తాం

కదా అని సరిపెట్టుకున్నాను. పనిలో పని ఒక్కసారి అమ్మతో మాట్లాడాలనిపించింది. మేము ఇద్దరం కూతుళ్ళం అమ్మకి. అక్కకి యు.ఎస్. సంబంధం చేసి పంపించేసారు. నేనేమో ఇక్కడే వున్నా దగ్గర వుండలేని పరిస్థితి. రోజంతా నానా చాకిరీ చేసొచ్చి, ఈ ఇంటి పనంతా చెయ్యాలంటే చచ్చేంత చిరాకు నాకు, కానీ ఏం చేస్తాం తప్పదు కదా! మాటల్లోనే నా బాధను పసిగట్టేసింది అమ్మ...ఎంతైనా అమ్మ కదా! ఒక్కసారి ఇంటికి రమ్మంటుంది. నా బాధ ఏమని చెప్పుకోను వాళ్ళకి? మా ఆయనుండగా ఫోన్ చేస్తే-

''మీ అమ్మతో మాట్లాడిన ఫోన్ బిల్లు కట్టడానికే నా జీతం సరిపోతుంది'' అంటాడు, వారానికి ఒక్కసారి ఫోన్ చేసినా సరే..ఎందుకీ గోల అని ఆయన లేనప్పుడే ఫోన్ చేస్తుంటాను. అలాంటిది వైజాగ్‌లో వున్న మా ఇంటికి వెళ్ళనిస్తాడా నన్ను? దారి ఖర్చులు దండగని ఏడుస్తాడు! ఇవన్నీ వాళ్ళకి చెప్పి బాధపెట్టడం ఎందుకని వాళ్ళకి తెలియనివ్వను. ఆడవాళ్ళ నోట్లో ఏదీ దాగదంటారు. కానీ, పుట్టినింటి నుంచి అడుగు బయటపెట్టాక ఇలాంటి విషయాల్ని మనసులోనే దాచుకోవడంలో ఆడవాళ్ళకు ఎవరూ సాటిరారు.

ఎన్నో ఆశయాలు..ఇంకెన్నో ఆదర్శాలు. అవన్నీ ఇప్పుడు ఏమయిపోయాయో. నేను వరకట్న దురాచారానికి వ్యతిరేకిని కానీ, నా పెళ్ళికి కట్నం ఇచ్చారు! నేను పురుషాధిక్యాన్ని వ్యతిరేకిస్తాను కానీ, మా ఇంట్లో మా ఆయనిదే ఆధిక్యత! నన్ను ఇంతదాన్ని చేసిన నా తల్లిదండ్రుల బాగోగులు నేనే చూసుకోవాలనుకున్నాను. కానీ, వీలుపడదు. నేను నా సంసార జీవితాన్ని ఒక మధురస్వప్నంగా ఊహించుకున్నాను. కానీ నా కల వాస్తవ రూపం దాల్చలేదు.

నా స్నేహితురాలు సరోజ గుర్తొచ్చింది. తను కూడా కాలేజ్‌లో ఒక అబ్బాయిని ప్రేమించింది కానీ అది పెళ్ళికి దారితీయలేదు. ఆ కొంపలో సరోజ జీవితాంతం ఒంటరిగా వుండిపోవాలని నిర్ణయించుకుంది. ఇప్పటికీ పెళ్ళి చేసుకోలేదు. మంచి ఉద్యోగంలో వుండి, తన తల్లిదండ్రులను బాగా చూసుకుంటుంది. అప్పుడు ఎంతో బాధపడినా ఇప్పుడు తను చాలా ఆనందంగా వుంది. ఎంత కాదన్నా నాకన్నా ఆనందంగా వుంది!

నా ఆలోచనలకు ఆనకట్ట వేస్తూ కాలింగ్‌బెల్ మ్రోగింది. యాదమ్మ నుంచి కబురు, రెండు రోజుల వరకూ రాదంట, వాళ్ళమ్మకు బాగోలేదంట! ఇప్పుడు నాకు యాదమ్మ మీద కోపం లేదు. తను పనికి రాకపోయినా కనీసం వాళ్ళమ్మను జాగ్రత్తగా చూసుకుంటుంది. నిజం చెప్పొద్దూ..నాలాంటివాళ్ళు చాలామంది చేయలేని పనిని యాదమ్మ చేస్తున్నందుకు తనంటే ఈర్ష్య కూడా కలిగింది నాకు.

సునీల్ ఎలాగూ పార్టీకి వెళ్ళాడు కాబట్టి ప్రసన్న, నేను భోజనానికి కూర్చున్నాం. టి.వి. ఆఫ్ చేసి ప్రసన్నతో మాట్లాడడం మొదలుపెట్టాను.

''ఏంటమ్మా ఈమధ్య సరిగ్గా చదవడం లేదంట? బాగా చదువుకోవాలమ్మా! ఇప్పుడు బాగా చదువుకుంటేనే రేపుప్రొద్దున్న నీకు డబ్బు, గౌరవం వుంటాయి. చదువు లేకపోవడం వలనే ఇంతకుముందు ఆడవాళ్ళు వంటింటికే పరిమితం అయిపోయేవాళ్ళు. కానీ ఇప్పుడు అలా కాదు కదా! అన్ని రంగాల్లోనూ ఆడవాళ్ళు ముందు వుంటున్నారంటే దానికి కారణం బాగా చదువుకోవడమే కదా! ఇప్పుడు కష్టపడితేనే తర్వాత సుఖపడవచ్చు. బాగా చదువుకున్నావనుకో, నాలాగా మంచి ఉద్యోగం వస్తుంది, సుఖంగా వుండొచ్చు. సరిగ్గా చదవలేదనుకో ఆ యాదమ్మలాగా చిన్న చిన్న పనులు చేసుకొంటూ కష్టపడవలసి వస్తుంది. ఏమ్మా! అలా అవ్వకూడదు కదా! అందుకే బాగా చదువుకోవాలి'' ముందే ఆలోచించుకున్నాను కాబట్టి ఇంత పెద్ద ఉపన్యాసం ఇవ్వగలిగాను. ప్రసన్న చాలాసేపు ఏమీ మాట్లాడలేదు. నా మాటలు బాగానే పనిచేసాయి కాబోలు ఆలోచించుకుంటుంది అనుకున్నాను. కానీ అది తుపాను రాబోయే ముందు వుండే ప్రశాంతత అని నేను అనుకోలేదు. నేను పెరుగు వడ్డిస్తుంటే తను అంది.

''అమ్మా! చదువుకొంటే బాగా సంపాదించుకోవచ్చు, మనం ఎవరి మీదా ఆధారపడనవసరం లేదు, హాయిగా బ్రతకొచ్చు అన్నావు. కానీ, యాదమ్మ నీకన్నా ఎక్కువ సెలవులు తీసుకుంటుంది, ఎక్కువసేపు వాళ్ళ పిల్లలతో గడుపుతుంది, ఎక్కువ సేపు టి.వి. చూస్తుంది, ఎక్కువ సినిమాలు చూస్తుంది, వాళ్ళ అమ్మను కూడా తనే చూసుకుంటుంది, మన ఇంట్లోకన్నా వాళ్ళ ఇంట్లోనే ఎక్కువ నవ్వులు వినిపిస్తాయి. తను నీమీద ఆధారపడే దానికన్నా నువ్వే తనమీద ఎక్కువ ఆధారపడుతున్నావు'' తను చెప్తూనే వుంది.

ఇంతలో తలుపు తోసుకుని మా ఆయన లోపలికి వచ్చాడు.

''ఏయ్! తల తిరిగిపోతుంది. కొంచెం మజ్జిగ ఇవ్వు'' అని తూలుతూ గదిలోకి వెళ్ళాడు.

ఆ క్షణం నా కూతురు నన్ను చూసిన చూపులో కొన్ని వేల ప్రశ్నలు...ఏ ఒక్కదానికీ నా దగ్గర సమాధానం లేదు.

''నువ్వు నిజంగా సుఖంగా వున్నావా అమ్మా?'' అన్న నా కూతురు ప్రశ్నతో నాలో మొదలైంది అంతర్మథనం.

☆

## ఆయేషా జిహ్వాచాపల్యం!

**'సూపర్' తర్వాత తెలుగు సినిమాల్లేని ఆయేషా టకియా తిరిగి బాలీవుడ్‌లోకి రావడానికి తన వంతు కృషి చేస్తూనే వుంది. అయితే ఈమధ్య కాస్త లావయింది ఆయేషా. ఆ సంగతి ఆమెనే చెబుతోంది గొప్పగా. ఓ హిందీ సినిమా షూటింగ్ కోసం సౌతాఫ్రికా వెళ్లిన ఆయేషా- అక్కడ సీఫుడ్ బాగా దొరకడంతో- అందునా రుచికరంగా ఉండడంతో తెగ లాగించేసిందిట. ఆమెకి చేపలు గ్రిల్లాలంటే చాలా ఇష్టంట. దాంతో పర్సనాలిటీలో కాస్త తేడా వచ్చిందనే సంగతి తను గ్రహించినా కూడా 'తిండి కంటే వేరే ఏముంటుంది! స్లిమ్‌గా ఎప్పుడైనా మారొచ్చు' అని తేలిగ్గా తీసుకుందిట. ప్చ్ అంతే లెండి జిహ్వాచాపల్యం అలాగే వుంటుంది.**

